దీపావళి కథల పోటీలో పాఠకుల నిర్ణయానికై ఎంపిక చేసిన కథ

# ఎక్స్‌గ్రేషియా




ఆ ఊరు అటు పల్లె కాదు, యిటు పట్నం కాదు అన్నట్టుంటుంది. పల్లెవాసనలు పూర్తిగా చావని అ ఊళ్ళో పట్టణపు గారడీలు యిప్పుడిప్పుడే ప్రారంభ మవుతున్నాయి.

అయినా అ వూళ్ళో ధనవంతుల ఆస్తులు. అంతస్థుల స్థాయి ఎంత ఎక్కువగా ఉందో పేదవాళ్ళ పేదరికపు స్థాయి అదే దిగువస్థాయిలో ఉంది. ఉన్న వాళ్ళకి, ఆ ఊళ్ళో వుండాల్సిన సౌఖర్యాలన్నీ ఉన్నాయి.

లేనివాళ్ళకి ఏమీ లేవు.

ఇలాంటి దారుణ తారతమ్యాలు వున్న ఆ ఊళ్ళో ఓ మారుమూల పదో పరకో సాధారణ ఇళ్ళు దూరంగా విసిరేసినట్లు ప్రత్యేకంగా కన్పిస్తుంటాయ్.

ఆ... కొద్దిపాటి ఇళ్ళు రెక్కాడితే గాని డొక్కాడని అతి సామాన్య బక్క రైతులవి.

ఉన్న కొద్దిపాటి భూమిని సేద్యం చేసుకుంటూ మిగతా సమయంలో కూలి, నాలి చేసుకోవడం వల్ల నోట్లో నాలుగేళ్ళు పెట్టుకోగలగుతున్నారు వాళ్ళు.

ఆ..... ఊర్లో భూస్వామి రైతులకు పిల్లలున్నట్టే యీ బక్కరైతులూ మానవమాత్రులేకాబట్టి వీళ్ళకీ పిల్లలున్నారు.

లేదంటే వాళ్ళు భవిష్యత్తును ఆలోచించి ఒక్కరో యిద్దరో సంతానంతో సరి పెట్టుకుంటే వీళ్ళు మాత్రం ముందువెనుకలు యేమాత్రం ఆలోచించకుండా, కొడుకుకోసం కొందరు, కూతురుకోసం మరికొందరు లెక్కలేనంత మందికి జన్మనిచ్చిన బాపతు !

పిల్లలకు జన్మనిస్తేనే సరా ! వాళ్ళకి కడుపునిండా తిండి పెట్టలేక వంటినిండా కప్పుకునేందుకు బట్టలు అందివ్వలేక నిత్యం సతమత మయిపోతున్న సంసారాలవి. గతి, గమ్యం, తెలీకుండా పరిగెడుతున్న జీవితాలవి.

పెద్దగా చెప్పుకోదగ్గ ఘనచరిత్రలంటూ లేని ఆ వూరు ఒకానొక రోజు పెద్ద చరిత్రనే సృష్టించింది. ఊరు వూరంతా సందడి సందడిగా తయారయింది.

అ... క్షణంలో బీదా బిక్కి రైతులు నివశించే అ మారుమూల ప్రదేశం ప్రత్యేకతను సంతరించుకుంది.

సమయం సరిగ్గా రాత్రి 10 . గం.లు కావచ్చు.

కష్టించిన శరీరాలు కాస్త తిని, మత్తు నిద్రలోకి జారిపోయే సమయం మిణుగురు పురుగుల వింతకాంతి తప్ప అన్యులు ఆ ప్రాంతంలో

అడుగుపెట్టలేనంత చిక్కని చిమ్మ చీకటిగా వుండే సమయం.

అలాంటిది పట్టపగలు మాదిరిగా ఆ ప్రాంతం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అలా అని, ప్రభుత్వం వారి పల్లె పల్లెకు 24 గంటల కరెంటు సరఫరా పథకం అనుకుందాం అంటే అ పథకాన్ని ప్రకటించే స్థితిలో యిప్పుడు ప్రభుత్వం లేదు.

రకరకాల టి.వి. ఛానెళ్ళ వాళ్లు తీస్తున్న వీడియోల తాలూకా తతంగం అది.

అలా అని అక్కడ ఏదో పెద్ద పార్టీనో పదిమందికి పనికి వచ్చే ఫంక్షనో జరుగుతుం దనుకుంటే పప్పులో కాలేసినట్టే, అక్కడ ఒక బక్క రైతు ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ ఊళ్ళోనే కాదు రాష్ట్రంలో యావత్ దేశంలో ఎంతోమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరి అన్నిచోట్ల ఇలాంటి హంగామా హడావిడి వుందా అంటే లేనే లేదని చెప్పుకోవాలి. వాళ్ళు ఆత్మహత్యలు చేసుకుంటే ఏమిటట అన్నంత సాధారణ విషయంగా పరిగణిస్తున్న తరుణంలో మరి ఏమిటి ఆ ఊళ్ళో యీ వింత.

ఆ వూరికి అసలు ఎప్పుడూ ఎలాంటి ప్రాధాన్యత లేదు. కనీసం ఎన్నికల సమయంలో ఓట్లు అడుక్కోవడానికి సైతం ఎలాంటి చోటా మోటా నాయకుడు అక్కడ అడుగుపెట్టరు. ఇక ఆ ప్రాంతం ఎం.ఎల్.ఎ. గురించి చెప్పుకోవల సిన పనిలేదు. అసలు అక్కడ ఆ వూరు వుందని తెలియకపోయినా ఆశ్చర్యపోనవసరంలేదు.

కాని ప్రస్తుత పరిస్థితి వేరు. ఈ ఊరు ఏ నియోజకవర్గంలో వుందో ఆ నియోజక వర్గానికి చెందిన ఎం.ఎల్.ఎ.గారికి క్యాబినెట్ విస్తరణలో మంత్రిపదవి దక్కింది. అంచేత మొదటిసారిగా మంత్రిగారు ఆ వూరికి వేం చేస్తున్నారు. అది అసలు విషయం.

ఒక ప్రక్క రైతుకుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయి వుంటే, మీడియా వాళ్ళ తలతిక్క ప్రశ్నలకి ఏడవాలో, తల గోడ కేసి బాదుకోవాలో తెలీని పరిస్థితిలో వాళ్ళు న్నారు. బెల్లం మీద ముసిరిన ఈగల్లా, ప్రెస్ వాళ్ళు రకరకాల ప్రశ్నల బాణాలను వదులు తుంటే బంగారం లాంటి భర్తను పోగొట్టుకున్న ఆ... మహాతల్లి రంగమ్మ అసలు నోరు మెద పడం లేదు. ఆగని జలపాతంలా ఆమెకన్నీటి ధార బుగ్గలపై చారలు కడ్తుంటే కళ్ళు ఎర్రని అగ్నిగోళాల్లా మెరుస్తున్నాయ్, ఏదో క్షణంలో ఆమె మౌనాన్ని వీడి అపరకాళిక అవు తుందా అన్నట్టుగా వుంది ఆమె రూపం. క్షణాల్లో ఆమెను చుట్టు ముట్టిన బంధువర్గం , చుట్టుప్రక్కలవాళ్ళు ఆమెను ఓదార్చడానికి విశ్వ ప్రయత్నం చేస్తు న్నారు.

విషయం తెలుసుకుని అప్పుడే అక్కడికి చేరుకున్న రంగమ్మ అన్నగారు తాతబ్బాయ్, చెల్లెలిని సమీపించగానే రంగమ్మ అన్నగారిని వాటేసుకుని బిగ్గరగా రోధించడం మొదలు పెట్టింది. ఆమెరోధన ఆ ప్రాంతవాసులందరిని కదిలించివేసింది.

చెల్లెలిని ఎలా ఓదార్చాలో తాత బ్బాయ్‌కి అర్థంకావడంలేదు. అతని కళ్ళు చెమ్మగిల్లి వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘాల్లా ఉన్నాయ్ మరోప్రక్క మీడియావాళ్ళ ప్రశ్నల వర్షం భరించలేక వాళ్ళమీద లాఠీచార్జి చేయాలన్నంత కోపం వస్తోందతనికి . అయినా సంయమనం పాటించి వాళ్ళకి అన్ని విధాలా సహకరిస్తూనే ఉన్నాడు. రంగమ్మనుండి ఎలాంటి సమాధానాలు రాబట్టలేక పోవడంతో మీడియా వాళ్ళ దృష్టంతా తాతబ్బాయ్ మీద పడింది.

రంగమ్మ మాత్రం అంత బాధలోను గతాన్ని అదే పనిగా గుర్తుచేసుకోవడం మొదలు పెట్టింది.

రంగమ్మ కాపరానికి వచ్చేసరికి ఆమె వయస్సు పదహారేళ్ళు వుండచ్చు. భర్త సింహాద్రి కంటె సరిగ్గా పదేళ్ళు చిన్నదని అమ్మలక్కలు అప్పట్లో అనుకున్న మాటలు రంగమ్మకు యింకా గుర్తున్నాయ్. పెళ్ళినాటికి సింహాద్రి పరిస్థితి అన్ని రకాలా బాగానే ఉంది. తన తండ్రి ద్వారా సంక్రమించిన రెండెకరాల ఊడుపు భూమిని జాగ్రత్తగా సాగుచేసుకుంటూ పొలం పనులు లేనప్పుడు యిద్దరు కూలీ,నాలీ చేసుకుంటూ ఖర్చులకుపోగా అంతో యింతో దాచిపెట్టుకున్న సందర్భాలు లేకపోలేదు.

అప్పట్లో వాళ్ళ జీవితంలో ఎలాంటి పొరపొచ్చాలు వచ్చిన సందర్భాలు కనిపించవు. అతని ఆనందమే అమె సంతోషంగా, అమె సంతోషమే అతని ఆనందంగా గడిపేశారు. వాళ్ళ ఆనందానికి చిహ్నంగా ముగ్గరు కూతుళ్ళు, ఒక కొడుకు సంసార ఫలాలుగా మిగిలేరు.

ఒకపక్క వృద్ధాప్యంతో చివికిన బొం తల్లా వున్న తల్లిదండ్రులను జాగ్రత్తగా బ్రతి కించుకుంటూ తమతాహతుకు మించిన సంసార భారాన్ని మోయడం కాస్త కష్టంగానే వుండేది వాళ్ళకి.

ఎంత సంపాదించినా, అవసరాలు ఎక్కువయిపోవడం, చేతికొచ్చిన పంట వచ్చి నట్లే వచ్చి చీడలపాలు కావడం, సకాలంలో వర్షాలు పడక పోవడం వంటి సమస్యలు, వాళ్ళ సంసారంలో సుఖశాంతులు కరువుకావడానికి నాందీ ప్రస్తావన జరిగిపోయింది.

క్రమంగా పొలంమీద పెట్టుబడి పెట్టడం గగనమయిపోయి, పెద్ద సాహసంగా తయారయింది. బ్యాంకుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం కరువయింది.

బాకీ డబ్బు కట్టందే ఋణం 'రీ-షెడ్యూల్' చేయలేమని, బ్యాంకు వాళ్ళు చేతు లెత్తేశారు. వాళ్ళు మాత్రం ఏంచేస్తారు పాపం! పెద్ద తిమింగలాలను తట్టుకోలేని పరిస్థితి, చిన్న చేపలను ఆదరించలేని అసమర్ధత! గోరుచుట్టు మీద రోకటి పోటుగా తయారయింది సింహాద్రి పరిస్థితి.

"రాబడి లేని ఈ పొలం మీద యిక మనం పెట్టుబడులు - పెట్టలేమయ్యా! వ్యవ సాయం మానేద్దాం" అంది ఓరోజు రంగమ్మ రాత్రి పక్క సర్దుతూ.

"ఆ!.... వ్యవసాయం మానేస్తే, ఎట్టా గడవాల్నే రంగమ్మా!" అన్నాడు సింహాద్రి ఆందోళనపడుతూ.

"వ్యవసాయం చేస్తుంటే, యిప్పుడు గడుస్తుందా చెప్పు! ఇంకా ఎన్నిరకాల అప్పులు చేస్తావ్? ఎంత వడ్డీ కడ్తావ్? ఎక్కడ నుంచి తెచ్చి కడ్తావ్? ఉన్న ఆ... కాస్త బంగారం, వెండి పెట్టుబడి రూపంలో యిప్పటికే కరిగి పోయాయా! ఇంకా యే సముద్రాన్ని ఈది యీ పెనుభారాన్ని మోద్దాం అనుకుంటున్నావ్' అంది బాధగా. ఆమె మాటలకు చలించిపోయాడు సింహాద్రి. కాస్త మనస్సు కూడగట్టుకొని 'అది కాదే రంగీ!' ఈ సంవత్సరం వర్షాలు బాగా కురుస్తాయని సిద్ధాంతి చెప్పనే చెప్పాడు కదా! పైగా, ఈసారి విత్తనాలు గాని, ఎరువులుగాని,

ప్రభుత్వమే సరసమయిన ధరలకు అందిస్తుందట! ఏమో, ఈసారి మన అదృష్టం పండి, పంట సజావుగా నిలిస్తే..." అన్నాడు సింహాద్రి ఆశగా.

"నిన్ను నిరుత్సాహపరచడం నా ఉద్దేశ్యం కాదయ్యా! ఎన్నాళ్ళిలా వత్తిడితో బతుకుతావ్. వళ్ళు బాగుంటే కలో గంజో తాగి, కూలి పని కెళ్దాం. శక్తి వున్నంతవరకు శ్రమపడదాం, మన పిల్లల్ని బతికించుకుందాం. నువ్వు రోజురోజుకి క్షీణించిపోయి అలా జావగారి పోతుంటే నేను మాత్రం భరించగలనా?" అంది బాధగా రంగమ్మ. ఆమె కళ్ళల్లో కన్నీటి తెర తళుక్కున మెరిసింది.

"రంగమ్మా! నువ్వు చెప్పింది కరక్టేనే, నేను కాదనడం లేదు. ఇన్నిసార్లు చూశాం, ఈ ఒక్కసారి ఆఖరిసారి అనుకుని ప్రయత్నం చేద్దాం.

సేఠ్ కిరణ్‌లాల్‌తో మాట్లాడాను. డబ్బిస్తానన్నాడు. అందరిలాంటివాడు కాదు ఆ సేఠ్. వడ్డీకోసం తొందరపడే రకం కానేకాదు. ఈ ఒక్కసారికి నామాట విను" అన్నాడు భార్యను బ్రతిమాలుతున్నట్లుగా.

"సరే కానియే చేసేదేముంది. పైగా నిండా నీట మునిగినోడికి చలేం పుడ్తుంది, అలాగే చేద్దాం" అంది పక్కమీద ఒరుగుతూ రంగమ్మ.

కాలం కలిసిరాకపోతే ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు మిగిలేది బూడిద మాత్రమే! బీదవాణ్ణి మరింత పేదవాడిగా చేయడం, ఉన్నవాణ్ణి మరింత ధనవంతుడిగా చేయడం సృష్టి రహస్యమనుకుంటాను. సింహాద్రి విషయంలో కూడా అదే జరిగింది. అతని ఆశలన్నీ అడియాశలయ్యాయి. పంట చేతి కొస్తుందని ఊహించుకుంటూ వివరిస్తున్న సింహాద్రికి, కుండపోత వర్షాలు కురిసి కొండంత షాక్ యిచ్చింది. పంట పూర్తిగా సర్వనాశనం అయిపోయింది.

పొలం చూసొస్తానని వెళ్ళిన సింహాద్రి తిరిగి యింటికి రాలేదు. మర్నాడు పెద్ద కాలువలో శవమై తేలాడు.

రంగమ్మ ఆవేదనతో, ఆలోచనలు మమేకమయి తనను తాను మరచి, మెదడంతా మొద్దు బారినట్లయి, ధ్యానంలో ఉన్న రాతి బొమ్మలా వుంది.

ఒక్కసారిగా బయట వినిపించిన కలకలంతో ఉలిక్కిపడి కళ్ళు తెరచింది. బయట కోలాహలం ఎక్కువయింది. మరిన్ని వీడియో కెమేరాలు అక్కడికి చేరుకున్నాయి.

"మంత్రి గారు వస్తున్నారట!" ఎవరో హడావిడిగా అక్కడి నుంచి కదిలిపోతూ అంటున్నారు.

"మంత్రిగారు మన ఊరు రావడం, నిజంగా మన అదృష్టం సుమా!" అంటున్నారు మరొకరు. పరిస్థితి చూస్తే, అసలు విషయం మరచిపోయినట్లు వుంది అక్కడి జనం.

చోటాలీడర్లతాకిడిమరీ ఎక్కువయింది. సింహాద్రి చనిపోయినసంగతి గురించి మాట్లాడుకోవడం తక్కువయి, మంత్రిగారి పర్యటన గురించిన ముచ్చట్లు ఎక్కువయినై.

మంత్రిగారు వస్తే, ఎక్కడ కూర్చోబెట్టాలి? ఏమేమి సర్వ్ చేయాలన్నది అక్కడి పెద్దల ఆలోచనలలోని ప్రధాన అంశం అయింది.

మంత్రిగారిని ఎలాంటి ప్రశ్నలు వేసి తికమక పెట్టాలన్న ఆలోచనల్లో మీడియా వాళ్ళు నిమగ్నమయి వున్నారు.

తెల్లగా తెల్లవారుతున్న సమయంలో పోలీసు వాళ్ళు కూడ అక్కడికి వచ్చి చేరారు. వాళ్ళ పనుల్లో వాళ్ళు సీరియస్‌గా వున్నారు. మంత్రిగారి సెక్యూరిటీ గురించిన అంశాలు వాళ్ల మెదళ్ళను పదును పెడుతున్నాయి. ఉన్నట్టుండి, ఒక్కసారి వీడియో కెమేరాలన్నీ రంగమ్మ ముఖం మీదికి సంధించబడ్డాయి. ఆ లైట్ల కాంతిని తట్టుకోలేని రంగమ్మ గట్టిగా కళ్ళు మూసుకుంది.

ఇంతసేపూ మౌనముద్రలో ఉన్న రంగమ్మ నోరు విప్పక తప్పలేదు.

"బాబూ! మా బాధలో మేముంటే, ఎందుకు మమ్మల్ని యిలా యిబ్బంది పెడుతున్నారు!" అంది రంగమ్మ నీరసంగా.

"అదేంటి రంగమ్మక్కా!అలా అంటావ్! యిదంతా నీకు జరిగిన అన్యాయం గురించే కదా!"అన్నారు గుంపులోనుంచి ఎవరో ఒకతను.

"నాకు జరిగిన అన్యాయాన్ని తీర్చగల వారెవ్వరు బాబూ! నాకు ఏర్పడ్డ లోటును ఎవరు భర్తీ చేయగలరు చెప్పండి! అనాథలయిన నా పిల్లల బ్రతుకులు ఎలా తెల్లారాలి నాయనా! భగవంతుడికే నామీద దయలేనప్పుడు, ఎవరు మాత్రం మమ్మల్ని ఆదుకోగలరు" అంది ఆయాసంగా రంగమ్మ.

"ఎందుకమ్మా అంత బాధపడ్తావ్, మంత్రిగారు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తారు. రైతు ఆత్మహత్య కదా! కనీసం రెండు లక్షలయినా నీ చేతికి వస్తాయ్!" అన్నాడు ఒక మీడియా పెద్దమనిషి.

"అయ్యా!అన్ని అనుభవాలు అయ్యాయి. వరదలు వచ్చినప్పుడు తుఫానుతో తల్లడిల్లి పోయినప్పుడు, ఈ పెద్దల వాగ్దానాలు, వాగ్దాన ఫలితాలు అన్నీ నాకు అనుభవమే నాయనా!" అంది రంగమ్మ.

"అవన్నీ వేరు. ఈనాటి పరిస్థితి వేరు. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం రైతుల కోసం ఏమైనా చేస్తుంది. పైగా... మన కొత్త మంత్రి గారు...." అంటూ యింకా యేదో చెప్పబోయాడు ఒక యువనాయకుడు. "బాబూ! నన్ను మన్నించండి. నన్నిలా వదిలేయండి. ఎవరి సహాయాన్ని అర్థించడానికి సిద్ధంగా లేను నేను. కొండంత అండగా వుండవలసిన సాక్షాత్తు నా భర్త, ఒక పిరికివాడుగా పై లోకాలకు పారిపోయినప్పుడు మీరు మాత్రం చేయగలిగిందేముంది?

నేను మాత్రం నా భర్తలా పిరికిదానిలా పారిపోను. నా రెక్కల్లో బలం వున్నంతవరకు, నేను కష్టపడ్తాను. నా భర్త చేసిన అప్పులన్నీ ధైర్యంగా తీరుస్తాను. నా కన్నబిడ్డల్ని గౌరవంగా పెంచుకుంటాను బాబూ! ఇప్పుడు నేను ఎవరి సహాయం ఆశించడం లేదు. నన్ను చూసి అనవసరంగా జాలి పడకండి. కాని ఒక్క సహాయం మాత్రం నాకు చేయండి. దయచేసి మీరంతా యిక్కడి నుండి తక్షణమే వెళ్ళిపోండి. నాలోకి పిరికితనం ప్రవేశించక ముందే, మీరంతా యిక్కడి నుండి వెళ్ళిపోండి" అంటూ భోరున ఏడ్వడం మొదలుపెట్టింది రంగమ్మ.

రంగమ్మ, అంత బాధలోను వెలిబుచ్చిన అభిప్రాయాలు అక్కడి వారిని ఆశ్చర్యపరచడమే కాదు, "శభాష్ రంగమ్మా!" అనేట్లు చేశాయి. బంధువులు, చుట్టుప్రక్కల వాళ్ళు తప్ప, మిగతా వాళ్ళంతా అక్కడి నుండి మెల్లగా జారుకున్నారు.

మంత్రిగారి కాన్వాయ్ మధ్యలోనే ఆగిపోయింది.